సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం । 29 । మార్చి । 2023



రాజన్న సేవలో 'బలగం' వేణు

వేములవాడ: బలగం సినిమా డైరెక్టర్ ఎల్దండి వేణు వేములవాడ రాజన్నను దర్శించుకుని కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు.



బద్దిపోచమ్మకు బోనం మొక్కులు

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. బోనం, కల్లు సాక, పట్నాల మొక్కు సమర్పించారు.

గరిష్టం/కనిష్టం
35.0/21.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం విపరీతమైన ఉక్కపోతగా ఉంటుంది.

రమజాన్ అంటే స్నేహం. నేనున్నానని చెప్పడం. నువ్వున్నావని గుర్తు చేసుకోవడం.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
బుధ 6.32	గురు 4.47

రంజాన్ వేళలు

తునికాకుతో ఉపాధి

- కల్లాలు లేకున్నా.. ఆకు సేకరణ
- కొమ్మకొట్టకున్నా.. కల్లం పెట్టకున్నా
- జిల్లాలో తునికాకు సేకరణ



ఇంట్లో తునికాకు కట్టలు కడుతున్న కుటుంబం

సిరిసిల్ల: అటవీ ప్రాంతాల్లోని పల్లెవాసులకు నమ్మకమైన ఉపాధినిచ్చే పని ఏదైనా ఉంది అంటే అది తునికాకు సేకరణే. వేసవిలో పెద్దగా వ్యవసాయ పనులు, ఇతర పనులు లేని రోజుల్లో గ్యారంటీగా ఇంటిల్లిపాదికీ తునికాకు సేకరణ పని కల్పిస్తుంది. జిల్లాలోని అటవీశివారు గ్రామాల్లో తునికి చెట్లు ఉన్నాయి. తునికాకు సేకరణకు జిల్లాలో అటవీశాఖ కల్లాలను ఏర్పాటు చేయలేదు. కానీ బీడీల తయారీకి వినియోగించే తునికాకు సేకరణతో పల్లె జనం ఉపాధి పొందుతున్నారు.

కొమ్మ కొట్టకపోయినా

అటవీ ప్రాంతాల్లోని తునికి చెట్లను జనవరి, ఫిబ్రవరి నెలలో కొమ్మకొట్టడం(ప్రూనింగ్) చేస్తే తునికి చెట్లకు మళ్లీ ఆకు చిగురిస్తుంది. ఫలితంగా నాణ్యమైన బీడీల ఆకు లభించేది. కానీ రెండు దశాబ్దాలుగా అటవీశాఖ తునికాకు సేకరణకు జిల్లాలో స్వస్తి పలికింది. తునికాకు సేకరణకు అటవీశాఖ గతంలో పలుమార్లు టెండర్లు పిలిచినా.. కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో కొమ్మ కొట్టే (ప్రూనింగ్) పనిని ఆపేశారు. అయినా తునికి చెట్లు బాగా ఉన్న ప్రాంతాల్లో ఆకు ఇగురు వచ్చింది. అటవీ ప్రాంత మహిళలు తెల్లవారుజామున తునికాకు సేకరణకు సమీప అడవుల్లోకి వెళ్తారు. తునికి చెట్ల ఆకును తెంపి ముల్లెకట్టుకుని ఇంటికి వస్తారు. మధ్యాహ్నం ఎండపూట ఇంట్లోనే తునికాకు మడతపెట్టి కట్టలుగా కడతారు. ఆకు ఎండిన తర్వాత తునికాకును స్థానిక బీడీ కంపెనీ టేకేదారులకు, బీడీ కార్మికులకు నేరుగా అమ్ముకుంటారు. 50 ఆకుల తునికాకు కట్ట ధరను ప్రభుత్వం రూ.3గా ధర నిర్ణయించగా.. అదే తునికాకు కట్టను రూ.5కు నేరుగా అమ్ముకునే అవకాశం ఉంది. ఒక్కో మహిళ నిత్యం 150 నుంచి 200కట్టల తునికాను సేరిస్తారు. ఈ లెక్కన నిత్యం రూ.750 నుంచి రూ.1000 వరకు సంపాదిస్తారు. దీంతో గ్రామీణులు ఆసక్తిగా తునికాకు సేకరిస్తున్నారు.

జిల్లా అంతటా తునికాకు ఉనికి

జిల్లాలోని అటవీ గ్రామాల్లో తునికాకు చెట్లు అధికంగా ఉన్నాయి. కోనరావుపేట, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, రుద్రంగి, చందుర్తి మండలాల్లోని గ్రామాల్లో తునికాకు ఉనికి ఉంది. ఈ మండలాల్లోని అటవీ గ్రామాల ప్రజలు ఏటా తునికాకు సేకరిస్తూ... ఉపాధి పొందుతున్నారు. ఎండలో ఇతర పనులకు వెళ్లకుండా నీడపట్టున ఉండి ఉపాధి పొందే వీలుండడంతో తునికాకు సేకరణ చేస్తున్నారు.

గతమెంతో ఘనం..

గతంలో తునికాకు సేకరణను అటవీశాఖ చేపట్టింది. జిల్లాలో 25 వేల స్టాండర్డ్ బ్యాగుల(ఎస్‌బీ) తునికాకు సేకరణ జరిగేది. ఒక్క కోనరావుపేట యూనిట్ పరిధిలోనే 5000 ఎస్‌బీల తునికాకు లభించేంది. ఒక్కో స్టాండర్డ్ బ్యాగులో వెయ్యి తునికాకు కట్టలు ఉండేవి. జిల్లాలో తునికాకు సేకరణకు అల్మాస్‌పూర్, గంభీరావుపేట, జిల్లెల్ల, మూడపల్లి, చందుర్తి, విలాసాగర్, కోనరావుపేట యూనిట్లు ఉండేవి. అప్పట్లో నక్సలైట్ల ప్రాబల్యంతో ఆకు సేకరణకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. అడవుల్లో ప్రతికూల పరిస్థితులు ఉండడంతో అధికారికంగా ఆకుసేకరణ నిలిచిపోయింది. కానీ పల్లె జనం మాత్రం ఉపాధిపై ఆశతో సేకరణ కొనసాగిస్తున్నారు. ఇంట్లో తునికాకు కట్టలు ఉంటే డబ్బులు నిల్వ ఉన్నట్లుగానే గ్రామీణులు భావిస్తున్నారు. ఇదే నమ్మకంతో ఆకు సేకరణ సాగిస్తున్నారు.

స్థానిక అవసరాలకు వాడుకోవచ్చు

జిల్లాలో అధికారికంగా తునికాకు సేకరణ జరగడం లేదు. తునికాకు ఉనికి కొన్ని ప్రాంతాల్లో ఉంది. ఈ సీజన్‌లో సేకరణ జరుగుతుంది. కానీ వన్యప్రాణుల సంచారం ఉంటుంది. అడవుల్లోకి వెళ్లకపోవడమే మంచిది. స్థానిక అవసరాలకు తునికాకును వినియోగించుకోవచ్చు. కానీ పెద్ద మొత్తంలో బీడీల ఆకును నిల్వ చేసి వ్యాపారం చేస్తే నేరమవుతుంది. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తాం. బీడీ కార్మికులకు స్థానికంగా వినియోగించుకోవడంపై ఎలాంటి ఆంక్షలు లేవు.

– సీ.హెచ్.బాలమణి, జిల్లా ఫారెస్ట్ అధికారిణి

మూలవాగును జీవనదిగా మార్చుతాం

- వేములవాడ మున్సిపల్ పాలకవర్గం బాగా పనిచేస్తోంది
- ఎమ్మెల్యే రమేశ్‌బాబు
- రూ.47 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం
- మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి హాజరైన కలెక్టర్, అడిషనల్ కలెక్టర్



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, కలెక్టర్ అనురాగ్ జయంతి, తదితరులు

వేములవాడ: వేములవాడ మూలవాగును జీవనదిలా మార్చుతామని ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. వేములవాడ మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలసి మంగళవారం హాజరయ్యారు. పాలకవర్గం బాగా పని చేయడం వల్లనే జాతీయ స్వచ్ఛ సర్వేక్షన్‌లో అవార్డుకు ఎంపికయ్యిందన్నారు. ఈ సందర్భంగా పాలకవర్గసభ్యులను అభినందించారు. రూ.42 కోట్లతో వేములవాడ ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు అందిస్తున్నామన్నారు. రూ.18 కోట్లతో నిత్యం గుడి చెరువులో గోదావరి జలాలు ఉండేలా చొరవ తీసుకుంటున్నామని తెలిపారు. రూ.140కోట్లతో సీసీ రోడ్లు, బైపాస్‌రోడ్డు వేసుకున్నామని పేర్కొన్నారు. పట్టణానికి 12,00 డబుల్ బెడ్రూం ఇండ్లు అందిస్తామని వివరించారు. మొదటి దఫాగా వంద యూనిట్లకు దళితబంధు పథకం అందిస్తామని అన్నారు. రూ.10కోట్లతో రోడ్లవెడల్పు, రూ.2కోట్లతో జంక్షన్ల సుందరీకరణ, రూ.2కోట్లతో మూలవాగు సుందరీకరణ, రూ.62 కోట్లతో 12 చెక్‌డ్యాంలు, రూ.504 కోట్లతో మల్కపేట రిజర్వాయర్ నిర్మాణం, రూ.3కోట్లతో వైకుంఠధామం నిర్మించుకున్నామన్నారు. త్వరలోనే సినారె కళామందిరం, స్టేడియం నిర్మాణాలు పూర్తి చేసుకుంటామన్నారు. రూ. 33 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, బద్దిపోచమ్మకు బోనాల మంటపం, రూ. 12 కోట్లతో పుష్కర ఘాట్లు నిర్మించబోతున్నట్లు చెప్పారు.

రూ.47 కోట్ల బడ్జెట్ ఆమోదం

వేములవాడ మున్సిపల్ 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.47 కోట్ల బడ్జెట్‌ను పాలకమండలి సభ్యులు ఆమోదించారు. చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం మంగళవారం జరిగింది. రూ. 47.10 కోట్ల ఆదాయం, రూ. 47.09 కోట్ల వ్యయం బడ్జెట్‌లను ఆమోదించినట్లు ప్రకటించారు. సాధారణ బడ్జెట్ రూ. 12.96 కోట్లు, టీయూఎఫ్ఐడీసీ ద్వారా రూ.28 కోట్ల రుణం, గ్రాంట్ల ద్వారా రూ.5.86 కోట్లు, గ్రీన్ బడ్జెట్ రూ.1.29 కోట్లుగా ప్రతిపాదించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో కమిషనర్ అన్సారీ, డీఈ తిరుపతి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ నమోదు చేసుకోవాలి



వీసీలో మాట్లాడుతున్న భీమ్యానాయక్

సిరిసిల్ల: జిల్లాలో ఆధార్ కార్డులు దిగి 18 ఏళ్లు దాటిన వారు, ఆధార్ కార్డులు లేనివారు కొత్తగా ఆధార్ నమోదు చేయించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.భీమ్యానాయక్ కోరారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం అన్ని మండలాల తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఆధార్ నమోదు ప్రక్రియలో మండల నోడల్ అధికారికి వెరిఫికేషన్‌కు వెళ్తుందని ఆయన వివరించారు. అప్పుడే పుట్టిన బిడ్డ కూడా ఆధార్ నమోదు చేయించుకోవచ్చని భీమ్యానాయక్ తెలిపారు. ఆధార్ అప్‌డేషన్‌పై ఆధార్ సంస్థ వారు సర్వీస్ ప్లస్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ మండలాల తహసీల్దార్లు, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'డబుల్' పనుల్లో వేగం పెంచాలి

ముస్తాబాద్: డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ అన్నారు. కొండాపూర్‌లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం పనులను మంగళవారం పరిశీలించారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేయాలని అన్నారు.

న్యూస్‌రీల్

రాజన్న హుండీ ఆదాయం రూ.1.06 కోట్లు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడ: వేములవాడ రాజన్నకు 13రోజుల్లో రూ.1.06కోట్ల ఆదాయం, 171 గ్రాముల బంగారం, 9.800 కిలోగ్రాముల వెండి సమకూరినట్లు ఈవో కృష్ణప్రసాద్ మంగళవారం తెలిపారు. స్వామివారి ఓపెన్‌స్లాబ్‌లో కట్టుదిట్టమైన భద్రత నడుమ స్వామి హుండీని లెక్కించారు. ఆలయ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బోదకాలు నిర్మూలనే లక్ష్యం



వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం

సిరిసిల్లటౌన్: జిల్లాలో బోదకాలు నిర్మూలనే లక్ష్యంగా వైద్యశాఖ పనిచేస్తోందని డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు అన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోని 6 నుంచి 7ఏళ్ల వయస్సుగల పిల్లలకు ఫైలేరియా పరీక్షలు మంగళవారం నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జిలావ్యాప్తంగా పది బృందాలు పర్యటించి 1,540 మంది పిల్లలకు ఫైలేరియా టెస్టులు నిర్వహించినట్లు వివరించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీరాములు, లింగం, బాలయ్య, జలపతి పాల్గొన్నారు.

డిజైనింగ్ శిక్షణతో ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న హరగోపాల్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నాబార్డు ద్వారా జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ అధ్వర్యంలో ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ పొందిన మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తూ.. ఆర్థికాభివృద్ధి సాధించాలని నాబార్డు జనరల్ మేనేజర్ హరగోపాల్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లు, స్టైఫండ్‌తో పాటు డెమో యూనిట్లు అందజేశారు. హరగోపాల్ మాట్లాడుతూ 15 రోజులకు ఒక బ్యాచ్ చొప్పున 90 మందికి మూడు బ్యాచ్‌ల ద్వారా శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. రానున్న రోజుల్లో రైతు ఉత్పత్తిదారుల కంపెనీగా ఏర్పాటు చేసుకుని రాజన్నపేట బ్రాండ్‌తో వస్తువులను ఉత్పత్తి చేయాలన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ అనంత్, ఏజీఎం మనోహర్‌రెడ్డి, సర్పంచ్ ముక్క శంకర్, ఎంపీటీసీ రజిత, కార్యదర్శి సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లాలో 'ఫైర్ సేఫ్టీ' తనిఖీ బృందాలు

సిరిసిల్ల: జిల్లాలో అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక తనిఖీ బృందాలను నియమిస్తూ కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలు జారీ చేశారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు, 13 మండలాల్లో 'ఫైర్ సేఫ్టీ' కోసం ప్రత్యేక బృందాలను నియమించారు. ఈ బృందాల్లో ఫైర్, పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, 'సెస్' అధికారులను నియమించారు. జిల్లాలోని వ్యాపార, వాణిజ్య సముదాయాలు, సినిమా హాళ్లు, విద్యాసంస్థలు, గోదాములు, ఆస్పత్రులు, అపార్టుమెంట్లు ఇంకా ప్రమాదకరంగా ఉండే వాటిని సంయుక్తంగా తనిఖీ చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇవ్వాలని కోరారు.


బోయినపల్లిలో వర్షం

బోయినపల్లి: మండలంలోని స్తంభంపల్లి, బోయినపల్లి, గుండన్నపల్లి, తడగొండ, బూర్గుపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం వర్షం కురిసింది. బోయినపల్లిలో మంగళవారం సంతలో కూరగాయలు, ఎండుమిరప, చింతపండు తదితర సామగ్రి విక్రయానికి తెచ్చిన వ్యాపారులు ఇబ్బంది పడ్డారు.

పంచాయతీరాజ్‌లో టీఎస్‌పీఎస్‌సీ తరహా కుంభకోణం

పట్టుకోండి చూద్దాం పార్ట్–6

- 1988లో కట్టా చేరే సమయంలో ఫోర్జరీ సంతకాలు
- సర్వీస్ రికార్డులో ఒక్కో పేజీకి ఒక్కో అధికారి సంతకం
- అంతర్గత సిబ్బందే అతనికి సాయం చేశారని సందేహాలు
- తప్పుడు విధానంలో చేరారంటూ నిగ్గుతేల్చిన నివేదిక
- త్వరలోనే వేటు ఖాయమంటున్న సహోద్యోగులు



ఎస్‌ఆర్‌లో ఫోర్జరీగా చెబుతున్న సంతకం



కట్టా విష్ణువర్ధన్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కట్టా విష్ణువర్ధన్ అలియాస్ వాసు.. పంచాయతీరాజ్ విభాగంలో ప్రస్తుతం ఏఈగా కొనసాగుతున్న ఈ ఉద్యోగి నియామకం, విద్యార్హతల విషయంలో ఆయన అందరినీ తప్పుదోవ పట్టించారని ఇంతకాలం అనుకున్నారు. కానీ.. అతని సర్వీసు రికార్డులు చూస్తే.. కట్టా విష్ణువర్ధన్ ఇదంతా బయట నుంచి ఒక్కరే చేయలేదనిపిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతున్న టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రాల లీకేజీల తరహాలోనే అతనికి పంచాయతీరాజ్ విభాగంలోని కొందరు సిబ్బంది సహకరించారన్న విషయం సర్వీసు రికార్డు చూస్తే అర్థం అవుతోంది. నేటి హైటెక్ యుగంలో ఉద్యోగ నియామకాల్లో అనేక అవకతవకలు వెలుగు చూస్తున్నాయి. కానీ.. ఎలాంటి టెక్నాలజీ లేని రోజుల్లోనే కట్టా విష్ణువర్ధన్ చాలా తెలివిగా తన సర్వీసు రికార్డులో అధికారుల సంతకాల ఫోర్జరీకి వ్యూహం రచించారని అతని సహోద్యోగులు కొత్త సందేహాలను లేవనెత్తుతున్నారు.

ఏం జరిగింది?

కట్టా విష్ణువర్ధన్ ఉరఫ్ వాసు వివాదం మరోసారి వార్తల్లోకెక్కింది. పంచాయతీ రాజ్ విభాగం వద్ద ఉన్న సమాచారం ప్రకారం.. కరీంనగర్ సబ్–డివిజన్, ఏఈ, విష్ణువర్ధన్ మార్చి2, 1967లో జన్మించారు. ఆయన తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ టీచర్లే. 1987లో తండ్రి వెంకట నాగరత్నాచారి మరణించారు. తన తల్లి ప్రభుత్వ టీచరు అన్న విషయాన్ని దాచి 1988లో కారుణ్య నియామకం కింద పంచాయతీరాజ్‌లో అప్పటి ఉమ్మడి జిల్లాలోని మహదేవాపూర్‌లో గ్రేడ్–3 వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా చేరారు. వాస్తవానికి 1984లోనే కట్టా నిరూప ప్రభుత్వ టీచర్‌గా నియమితులయ్యారు. కరీంనగర్ డీఈవో కార్యాలయంలో ఆమె పుట్టిన తేదీ ఫిబ్రవరి 01, 1956గా ఉంది. విచిత్రంగా విష్ణువర్ధన్ తన పదో తరగతి సర్టిఫికెట్లలో మార్చి 2, 1967లో జన్మించినట్లు పేర్కొన్నారు. తల్లి కంటే కేవలం పదేళ్లు చిన్నవాడైన ఉద్యోగిగా అరుదైన రికార్డును తనపేరిట లిఖించుకున్నాడు. అదే సమయంలో గ్రేడ్–3 వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా ఉమ్మడి జిల్లాలోని మహదేవాపూర్‌లో చేరారు. ఈ విషయం తన సర్వీసు రికార్డులోని అతని చేరికను ధ్రువీకరిస్తూ అతనిపై అధికారి తొలిపేజీలో చేసిన సంతకాన్ని చూసి చెప్పొచ్చు. రెండోపేజీలోనూ అదే అధికారి సంతకం ఉండాలి. కానీ, మరో సబ్ డివిజన్ సుల్తానాబాద్‌కు చెందిన డీఈ సంతకం ఉండటంతో ఈ వివాదం సరికొత్త మలుపు తిరిగింది. నిబంధనల ప్రకారం.. రెండు పేజీల్లోనూ ఒకే అధికారి సంతకం, స్టాంప్ ఉండాలి. ఇక్కడ వేర్వేరు సబ్‌డివిజన్లకు చెందిన డీఈల సంతకాలు ఉన్నాయి. దీన్ని ఉన్నతాధికారులు ఎలా ఆమోదించారో అని మిగిలిన సిబ్బంది ముక్కున వేలేసుకుంటున్నారు.

రెండు సంతకాలు, రెండు స్టాంపులు..

ఇక్కడ మరో ఆసక్తికరమైన అంశం ఏంటంటే.. రెండో పేజీలో డీఈ రవికుమార్ సంతకం, సుల్తానాబాద్ సబ్ డివిజన్ స్టాంప్ ఉంది. అదే సమయంలో మరో అధికారి సంతకం, జగిత్యాల సబ్‌డివిజన్ స్టాంప్ ఉంది. ఇంకా పరిశీలించి చూస్తే.. వీటి అడుగున వేములవాడ సబ్ డివిజన్ స్టాంప్ కూడా ఉంది. మొత్తానికి రెండు సంతకాలు మూడు స్టాంపులతో రెండో పేజీని అత్యంత గందరగోళంగా ఉంది. ఈ లెక్కన చూస్తుంటే.. ఈ సంతకాలను ఫోర్జరీ చేసి ఉంటారని, దీనికి సూత్రధారి విష్ణువర్ధన్ అయి ఉంటాడని సహోద్యోగులు అనుమానిస్తున్నారు. తప్పుడు దారిలో కొలువు సాధించి, అనుమానాస్పద విద్యార్హతలతో ఉద్యోగం చేస్తున్న కట్టాకు ఫోర్జరీలు పెద్ద విషయమేమీ కాదని ఆరోపిస్తున్నారు. ఈ లెక్కన అతని నియామకం సమయంలో కొందరు కీలక ఉద్యోగులు విష్ణువర్ధన్‌కు సహకరించారని తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సర్వీసు రికార్డును ఇంతకాలం వీసమెత్తు అనుమానం రాకుండా ఉందని విమర్శిస్తున్నారు.

ఆ సంతకం నాది కాదు

విష్ణువర్ధన్ విద్యార్హతల వివాదం చాలాకాలంగా కొనసాగుతోంది. ఆయన తన సర్వీసులో ఏనాడూ నా వద్ద పనిచేయలేదు. కానీ.. అతని సర్వీసు రికార్డు బుక్‌లో నా సంతకం ఉండటం ఆశ్చర్యానికి గురిచేసింది. నూటికి నూరుపాళ్లు అది నా సంతకం కానే కాదు.

– రవి కుమార్, విశ్రాంత పీఆర్ ఇంజినీర్

ఆలోచింపజేస్తున్న పోలీస్ ఫ్లెక్సీ



పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వేములవాడరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు ఆలోచింపజేస్తున్నాయి. వేములవాడ రూరల్ మండలంలోని 17 గ్రామాల ప్రధాన కూడళ్ల వద్ద పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 02 వరకు జరిగే ట్రాఫిక్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ నియంత్రణపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. జీవితం చాలా చిన్నది.. రాంగ్ రూట్ డ్రైవింగ్ నరకానికి దగ్గర దారి, ఒక్క తల పోతే రెండో తల పొందలేరు.. తల మీది రక్షణ నాది అంటూ ఫ్లెక్సీపైన బొమ్మలు ఆలోచింపజేస్తున్నాయి. వారోత్సవాల్లో భాగంగా ఆరు రోజులు అన్ని గ్రామాల్లో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్సై నాగరాజు వివరించారు.

బైబై.. మళ్లీ కలుద్దాం..







ఇంటర్మీడియట్ తొలి సంవత్సరం పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు పరీక్ష పూర్తి అయ్యాక తోటి మిత్రులతో బైబై చెబుతూ విద్యార్థులు తాత్కాలిక సెలవు తీసుకున్నారు. మళ్లీ వచ్చేవిద్యా సంవత్సరంలో కలుద్దాం అని పరస్పరం వీడ్కోలు చెప్పుకున్నారు విద్యార్థులు. – సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల



నెమలి వాహనంపై దర్శనం

వేములవాడ: రాజన్న సన్నిధిలో జరుగుతున్న సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారు నెమలి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ఆలయంలోనే ప్రదక్షిణలు నిర్వహించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. 30న జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి ఆలయ అధికారులు రూ.15 లక్షలతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం రాత్రి కల్యాణ వేదిక పనులను ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, ఏఈ డి. శేఖర్‌లు పరిశీలించారు. ఆలయం ఎదుట భక్తులు కూర్చుండేందుకు వీలుగా చలవ పందిళ్లు, షామియానాలు వేస్తున్నారు.

ఒక్కరి ప్రాణాన్ని కాపాడినా చాలు

- సీపీఆర్‌పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్



సీపీఆర్‌పై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల: నిత్యం ప్రజల మధ్యలో ఉండే పోలీసులకు కార్డియో పల్మనరీ రిసిసిటేషన్(సీపీఆర్)పై సంపూర్ణ అవగాహన అవసరమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సిరిసిల్ల పద్మనాయక ఏసీ హాల్‌లో మంగళవారం పోలీసు అధికారులు, సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఎవరికైనా ఆకస్మికంగా గుండెపోటు వస్తే.. వెంటనే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో పోలీసులకు తెలిసి ఉండాలన్నారు. సమాజం కోసం, ఇంట్లోని వారి కోసం సీపీఆర్‌పై పరిపూర్ణమైన అవగాహన పెంచుకోవాలని, మొక్కుబడిగా, నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఎస్పీ సూచించారు. మనం నేర్చుకున్న అంశం ద్వారా ఒక్క ప్రాణాన్ని కాపాడినా.. అంతకంటే తృప్తి మరొటి ఉండదని అఖిల్ మహాజన్ అన్నారు. ప్రాణాలకన్నా ఏదీ విలువైంది కాదన్నారు. నిత్యం వ్యాయామం చేస్తూ.. మంచి ఆహార అలవాట్లతో ముందుకు వెళ్లాలని ఎస్పీ సూచించారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో గుండెపోటు రావడం సర్వసాధారణంగా మారి మరణాలు పెరిగిపోతున్నాయన్నారు. సీపీఆర్‌పై శిక్షణ ఇవ్వడం, పోలీస్ సిబ్బందిలో అవగాహన పెంచడం అభినందనీయమన్నారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్‌కుమార్, ఆర్ఐలు కుమారస్వామి, రజినీకాంత్, మెడిలైఫ్ హాస్పిటల్ డాక్టర్లు చేతన్ చౌహాన్, జి.శ్రీనివాస్, అక్షయ్‌రెడ్డి, ప్రసాద్, శ్రీకాంత్, హరీష్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

గవర్నర్‌కు లేఖ



ఉత్తరాలతో బీజేవైఎం నాయకులు

బోయినపల్లి: టీఎస్‌పీఎస్సీ లీకేజీ బాధ్యులపై కఠినచర్యలు తీసుకుని నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం బీజేవైఎం మండల నాయకులు గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్‌కు స్థానిక తపాల కార్యాలయం నుంచి ఉత్తరాలు పంపించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ లీకులతో పరీక్షలు రద్దై నిరుద్యోగులు అంతులేని బాధ అనుభవిస్తున్నారన్నారు. పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు చెన్నాడి రాజిరెడ్డి, నాయకులు మినుకుల శ్రీనివాస్, చిచ్చుల వెంకటేశ్, మంతెన సతీశ్, అన్నాడి కమలాకర్‌రెడ్డి, బుర్ర మహేశ్, ద్యావ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైవోల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

కోనరావుపేట: మండలంలోని మర్తనపేటలో హైవోల్టేజీతో పలువురి ఇళ్లలో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. మంగళవారం సాయంత్రం విద్యుత్‌వైర్లు రెండు అంటుకోవడంతో హైవోల్టేజీ ప్రసారమైంది. దీంతో గ్రామానికి చెందిన ముదాం రవి, బోనాల నారాయణ, గుమ్మడి దారి బాలయ్య ఇళ్లలో టీవీలు కాలిపోయాయి. బోనాల శ్రీనివాస్, గోల్కొండ సందీప్ ఇళ్లలో స్టెబిలైజర్లు కాలిపోగా మరికొందరి ఇళ్లలో ఫ్యాన్లు, ఇతర వస్తువులు కాలిపోయాయి.

రాములోరి పెళ్లికి రండి సార్..



ఎస్పీ అఖిల్ మహాజన్‌ను ఆహ్వానిస్తున్న శ్రీరాములు, పీఆర్‌వో చంద్రశేఖర్

వేములవాడ: ఈనెల 30న రాజన్న సన్నిధిలో నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి హాజరు కావాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను ఆలయ పీఆర్‌వో విభాగం పర్యవేక్షకుడు శ్రీరాములు, పీఆర్‌వో చంద్రశేఖర్, ఫొటోగ్రాఫర్ సాయిలు మంగళవారం స్వామివారి ఆహ్వానపత్రికను అందించారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలు

సిరిసిల్లకల్చరల్: దేశవ్యాప్తంగాకేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైంది. జిల్లాకేంద్రంలోని విద్యాలయంలో ఒకటో తరగతిలో ప్రవేశాలకు సోమవారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఏప్రిల్ 17 తుది గడువుగా నిర్ణయించారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఎంపికైన విద్యార్థుల తొలి జాబితాను ఏప్రిల్ 20న ప్రచురిస్తారు. కేటగిరీల వారీగా సీట్ల కేటాయింపు జరుపుతారు. వరుసగా ఏప్రిల్ 28న రెండో జాబితా, మే4న తుది జాబితాను విడుదల చేస్తారు. ఆన్‌లైన్‌లో తగినని దరఖాస్తులు రాని పక్షంలో రెండో ప్రకటన జారీచేస్తారు. రెండో తరగతి నుంచి మిగిలిన అన్ని తరగతుల్లో ప్రవేశాల కోసం మే 4 నుంచి స్వీకరించి 18న ఎంపికైన జాబితా విడుదల చేస్తారు. పదోతరగతి ఫలితాలు విడుదలైన వారం రోజుల్లో 11వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ మొదలవుతుందని విద్యాలయ ప్రిన్సిపాల్ రణ్‌రంజయ్ సింగ్ తెలిపారు.

ఆధార్ అప్‌డేట్ అయ్యేదెప్పుడు..?

- నిలిచిన ఆధార్ సేవలు
- కొరవడిన ప్రచారం
- అప్‌డేట్ కోసం ప్రజల ఇబ్బందులు



కోనరావుపేటలో మూసిఉన్న ఆధార్ నమోదు కేంద్రం

కోనరావుపేట(వేములవాడ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలకు రాయితీలు పొందాలన్నా, బ్యాంక్‌లో ఖాతా తెరవాలన్నా, పాన్‌కార్డు, పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేయాలన్నా ఆధార్ కార్డు తప్పనిసరి. అయితే పదేళ్లకోసారి ఆధార్‌కార్డు అప్‌డేట్ చేసుకోవాలని యూఐడీఏఐ సంస్థ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాలో ఆధార్‌కేంద్రాలు సక్రమంగా పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వీటితో పాటు ఆధార్ అప్‌డేట్‌పై ప్రజల్లో అవగాహన కరువైంది.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 19 ఆధార్‌సెంటర్లు ఉండగా అందులో సగం సెంటర్లు పనిచేయడం లేదు. కోనరావుపేట మండలంలోని 28 గ్రామాలకు కలిపి ఒకేఒక్క ఆధార్ నమోదుకేంద్రం ఏర్పాటుచేశారు. మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన ఈ కేంద్రంలో అన్ని గ్రామాల ప్రజలకు ఆధార్‌సేవలు అందేవి. 2022 మార్చినుంచి ఆధార్ సేవలు నిలిచిపోయాయి. ప్రతిరోజూ పలు గ్రామాల నుంచి ప్రజలు వచ్చి తిరిగి వెళ్తున్నారు.

ఆధార్ అప్‌డేట్‌పై అవగాహన కరువు...

2015కంటే ముందుకంటే ఆధార్ గుర్తింపుకార్డును పొందిన వారు యూఐడీఏఐ ఆదేశాల ప్రకారం సంబంధిత పత్రాలతో తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలి. 15 ఏళ్ల చిన్నారులు బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలి. ఇందుకోసం సదరు వ్యక్తులు ఆధార్ నమోదు కేంద్రానికి వెళ్లాలి. ఈ విషయంపై ప్రజల్లో అవగాహన కూడా లేదు. విషయం తెలుసుకున్న కొంతమంది వెళ్లగా సెంటర్ మూసేసి ఉంటుంది.

ఏడాదికాలంగా తప్పని తిప్పలు...

ఆధార్ అప్‌డేట్‌కు ఆధార్ సెంటర్లే కాకుండా పోస్టాఫీసులు, బ్యాంకులు, సీఎస్సీ, ఎమ్మార్సీల్లో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ సెంటర్లలో కూడా సేవలు అందడంలేదు. కోనరావుపేట మండలంలో ఏడాదికాలంగా ఆధార్ సెంటర్ పనిచేయకపోవడంతో అన్ని గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ మారుమూల గ్రామాల నుంచి రావడం, తాళం వేసిన కేంద్రాన్ని చూసి తిరిగి వెళ్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆధార్‌సెంటర్‌ను వినియోగంలోకి తెచ్చేలా చూడాలని కోరుతున్నారు.

త్వరలోనే ప్రారంభిస్తాం

ఆధార్ అప్‌డేట్ కోసం ఆధార్ సెంటర్లే కాకుండా పోస్టాఫీసుల్లో, బ్యాంకుల్లో, సీఎస్సీ సెంటర్‌లో, ఎమ్మార్సీలో కూడా ఆధార్ సేవలు పొందవచ్చు. కోనరావుపేటలో ఆధార్ సేవలను త్వరలోనే పునరుద్దరిస్తాం. కొన్ని కారణాలతో ఆధార్ నమోదుకేంద్రం సేవలు ఏడాదిగా నిలిపివేశాం. త్వరలోనే సేవలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. అప్పటి వరకు ప్రత్యామ్నాయంగా మరో ఆధార్‌సెంటర్‌ను ఏర్పాటు చేసి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూస్తాం.

– మహేశ్, జిల్లా మేనేజర్

దళారీ దగా..!

- సౌదీలో నిర్వాకం
- జైలులో చిట్టాపూర్‌వాసులు



చిట్టాపూర్‌కు చెందిన జోగ ఆనంద్ భార్య, పిల్లలు

కోరుట్ల/మల్లాపూర్: దళారీ దగా.. పనికి సంబంధించిన వీసా పర్మిట్ లేనిఫలితంగా జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన ఆరుగురు సౌదీలో జైలుపాలయ్యారు. వివరాల్లోకి వెళితే.. మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన జోగ ఆనంద్(42), జోగ రాజు(35), వీరవత్తిని శ్రీనివాస్(45), అరిసెల్ల గోపీ(35), కటుకం రాజ్‌కుమార్(32)తోపాటు మరో యువకుడు ఏడాది క్రితం ఆజాద్ వీసాలతో సౌదీ వెళ్లారు. డ్రైవర్ పని వీసాలతో అక్కడికి వెళ్లిన వీరు.. టైలరింగ్, క్లీనింగ్ వంటి పనుల్లో చేరి ఉపాధి పొందుతున్నారు. సౌదీ పోలీసులు వీసా ప్రకారం పనిలో లేనివారిని తిరిగి స్వదేశాలకు పంపుతున్న క్రమంలో చిట్టాపూర్ యువకులు అక్కడ పోలీసులకు దళారీగా పనిచేసే వ్యక్తి దృష్టికి వచ్చినట్లు సమాచారం. సదరు దళారీ వీసాలో లేనిపనులు ఎలా చేస్తున్నారని, పోలీసులకు పట్టిస్తానని బెదిరించి డబ్బులు డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో చిట్టాపూర్ యువకులు భయపడి సదరు దళారీకి సుమారు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఇచ్చి తమ సమాచారం పోలీసులకు ఇవ్వవద్దని బతిమిలాడినట్లు తెలిసింది. అయినప్పటికీ దళారీ మళ్లీ రూ.10 లక్షలు ఇవ్వాలని బెదిరించడంతో అంతడబ్బు తమవద్ద లేదని బాధిత యువకులు నిరాకరించినట్లు సమాచారం. ఈ క్రమంలో దళారీ వీరి చిరునామాను అక్కడి పోలీసులకు అందించడంతో సోమవారం యువకులను వీరిని అరెస్టు చేసినట్లు సమాచారం. మంగళవారం సాయంత్రం అరెస్ట్ సమాచారం స్థానికంగా తెలియడంతో యువకుల బంధువులు తమవారు ఎలా ఉన్నారోనని ఆందోళన చెందుతున్నారు. జైలులో ఉన్నట్లుగా చెబుతున్న చిట్టాపూర్ గ్రామానికి చెందిన జోగ ఆనంద్ భార్య సుజాత మాట్లాడుతూ, తన భర్తను జైలు నుంచి విడిపించి ఇండియాకు వచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రోదిస్తూ చెప్పింది. సౌదీ పోలీసులు వీసా పర్మిట్ ప్రకారం పనుల్లో లేనివారిని గుర్తించి అరెస్టు చేసి మరోసారి సౌదీకి రాకుండా బ్యాన్ విధించి వారివారి స్వస్థలాలకు పంపుతున్నట్లు తెలిసింది.

ఆగని టీచకపర్వం!

- సిబ్బంది నుంచి లేఖల కోసం బలవంతం
- వీడియోలు విడుదలైనా.. కాపాడేందుకు నేతల ప్రయత్నం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల మోడల్ స్కూల్ మాజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సస్పెండ్ అయినా.. తాను ఉత్తముడిని అంటూ నిరూపించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా ఉన్న శ్రీనివాస్ మహిళా సిబ్బంది పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న వీడియోలు విడుదలయ్యాయి. తమను పదేపదే వేధిస్తున్న శ్రీనివాస్ బండారాన్ని లోకానికి తెలిపేందుకు తోటి ఉద్యోగులే రహస్యంగా వీడియోలు తీశారు. ఈ వీడియోలు 'సాక్షి'కి చేరడంతో వెంటనే కలెక్టర్ యాస్మిన్ బాషాకు చేరవేసింది. వీడియోలో శ్రీనివాస్ చర్యలు చూసి మండిపడ్డ కలెక్టర్ అతన్ని ఈనెల 16వ తేదీన సస్పెండ్ చేసిన విషయం విదితమే.

నేడు స్కూలుకు విచారణ కమిటీ..!

ఈ వ్యవహారంపై దర్యాప్తు చేసేందుకు బుధవారం విచారణ కమిటీ స్కూలుకు రానుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సస్పెండ్ అయిన శ్రీనివాస్ తాను ఉత్తముడని చెప్పుకునేందుకు ముందే ప్లాన్ వేశారు. మహిళా సిబ్బంది వద్దకు వెళ్లి.. శ్రీనివాస్ మంచోడు అంటూ స్వచ్ఛందంగా రాసి ఇచ్చినట్లుగా ముందే రాసిన లేఖలు వారికి ఇచ్చి వాటిపై సంతకాలు చేయించేందుకు యత్నించారు. ఈ ఘనకార్యానికి ఓ మహిళా ఉద్యోగి నేతృత్వం వహిస్తున్నట్లు సిబ్బంది వాపోతున్నారు. పర్మినెంట్ ఉద్యోగులంతా ఆ లేఖలపై సంతకాలు చేయకుండా సున్నితంగా తిరస్కరించారు. అయినా.. పట్టువదలకుండా తాత్కాలిక సిబ్బందితో అవే లేఖలపై సంతకాలు చేయించుకున్నారని సమాచారం. ఈ లేఖలను బుధవారం స్కూల్‌కు విచారణకు వచ్చే కమిటీకి అందజేసేలా ప్లాన్ వేశారని సిబ్బంది ఆరోపిస్తున్నారు. అదే సమయంలో విచారణ కమిటీతో నిందితుడు శ్రీనివాస్ కూడా రానున్నట్లు తెలిసి సిబ్బంది తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అతను ఎదురుగా ఉంటే విచారణ పారదర్శకంగా ఎలా జరుగుతుందన్న సందేహాలు లేవనెత్తుతున్నారు. మరో ఆసక్తికరమైన అంశమేంటంటే.. శ్రీనివాస్ ఉత్తముడు అంటూ లేఖలపై సంతకాలు పెట్టాల్సిందిగా ఓ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, మరో నలుగురైదుగురు చోటా లీడర్లు స్కూలు సిబ్బందిపై ఒత్తిడి తీసుకువస్తుండటాన్ని వారంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన సభ్యులు

వేములవాడ: వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంట రాజు, ప్రధానకార్యదర్శిగా నక్క దివాకర్, ఉపాధ్యక్షుడిగా ప్రతాప సంతోష్, జాయింట్ సెక్రటరీగా జంగం అంజయ్య, కోశాధికారిగా బొజ్జ నరేశ్, క్రీడలు, కల్చరల్ కార్యదర్శిగా జి.సత్యనారాయణ రెడ్డి, లైబ్రెరీ కార్యదర్శిగా గుజ్జ మనోహర్, సీనియర్ ఈసీ మెంబర్లుగా నరాల శ్రీనివాస్, దొబ్బల ప్రవీణ్, నాగుల సంపత్, జూనియర్ ఈసీ మెంబర్లుగా జెట్టి శేఖర్, తొటశేఖర్, మహిళా ప్రతినిధిగా అన్నపూర్ణ ఎంపికైనట్లు ఎన్నికల అధికారి గుడిసె సదానందం తెలిపారు. మంగళవారం ఉదయం బార్ అసోసియేషన్ గదిలో నిర్వహించిన ఎన్నికల్లో మొత్తం 87 ఓట్లకు గాను 83 ఓట్లు పోలైనట్లు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా ప్రతాప సంతోష్, జాయింట్ సెక్రటరీ జంగం అంజయ్య, క్రీడల కార్యదర్శిగా జి.సత్యనారాయణ రెడ్డి, జూనియర్ ఈసీలు జెట్టి శేఖర్, తోటశేఖర్, మహిళా ప్రతినిధి అన్నపూర్ణలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. నూతనకమిటీని జడ్జిలు సత్తు రవీందర్, ప్రతీక్ సిహాగ్‌లు అభినందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. తమపై విశ్వాసంతో గెలిపించిన అడ్వకేట్లకు కృతజ్ఞతలు తెలిపారు. అడ్వకేట్ల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి



మృతిచెందిన రాజమ్మ

సిరిసిల్లటౌన్: అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి సిరిసిల్ల పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బల్ల రాజమ్మ ఇద్దరు కొడుకులు రాజేశ్, రాజుతో పాటు ఉంటోంది. మొదటి అంతస్తులో పెద్దకొడుకు రాజేశ్‌తో ఉంటుండగా.. కింది అంతస్తులో చిన్నకొడుకు రాజు నివసిస్తున్నాడు. మంగళవారం రాత్రి రెండో అంతస్తుకు వెళ్లిన రాజమ్మ కిందపడి అక్కడికక్కడే మృతిచెందింది. విచారణ చేస్తున్నట్లు టౌన్ సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల కొత్త బస్టాండ్ సమీపంలో మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌కు చెందిన సీహెచ్. రమేశ్, రాజు అనే ఇద్దరు కొత్తబస్టాండ్ మీదుగా బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం అందించగా సిబ్బంది అనిల్, పెద్ది శ్రీనివాస్‌లు బాధితులను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ పంపించారు.

పిచ్చికుక్కల దాడిలో గొర్రెలు మృతి

చందుర్తి(వేములవాడ): మండలంలోని నర్సింగపూర్‌లో పాకలో ఉన్న గొర్రెల మందపై పిచ్చికుక్కలు మంగళవారం దాడిచేశాయి. గ్రామస్తుల కథనం ప్రకారం... నేరెళ్ల మల్లేశం అనే గొర్రెల కాపరి మధ్యాహ్నం పొలం వద్దనున్న పాకలో గొర్రెలను వదిలి భోజనానికి ఇంటికి వెళ్లాడు. ఇదే సమయంలో పాకలో చేరిన పిచ్చికుక్కలు వాటిపై దాడిచేశాయి. ఈ దాడిలో ఆరు గొర్రెలు మృతిచెందగా, మరో 4 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. దీంతో కాపరికి రూ. 50వేలకు పైగా నష్టం వాటిల్లిందని కన్నీరుమున్నీరుగా విలపించాడు. మృతిచెందిన గొర్రెలకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టైమ్‌బార్ విద్యార్థులకు అవకాశం

సిరిసిల్లకల్చరల్: శాతవాహన యునివర్సిటీ పరిధిలో డిగ్రీ ప్రవేశాలు తీసుకుని నిర్దేశిత గడువు లోపు ఉత్తీర్ణులు కాని టైమ్‌బార్ విద్యార్థులు తమ బ్యాక్‌లాగ్ సబ్జెక్టులను క్లియర్ చేసుకునేందుకు వర్సిటీ అనుమతించింది. 2016–17లో ప్రవేశాలు తీసుకుని, సబ్జెక్టులు ఇంకా మిగిలి ఉన్న అభ్యర్థులు ప్రతి సబ్జెక్టుకు రూ. 1000 పరీక్ష ఫీజు చెల్లించాలని యునివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ఎస్.రంగప్రసాద్ తెలిపారు. అలాగే 2017–18, 2018–18 విద్యాసంవత్సరాల్లో డిగ్రీ అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు సైతం ఏప్రిల్ 3 లోపు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా పరీక్ష ఫీజులు చెల్లించాలని సూచించారు. రూ.300 అపరాధ రుసుముతో ఏప్రిల్ 11 వరకు పరీక్ష ఫీజులు చెల్లించవచ్చునన్నారు. బ్యాక్‌లాగ్ సబ్జెక్ట్‌ల వివరాలు, ఫీజుల వివరాల కోసం విద్యార్థులు తాము ప్రవేశాలు పొందిన కళాశాల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని సూచించారు.

బ్రహ్మోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు



నీడ కోసం ఏర్పాటుచేసిన చలువ పందిళ్లు

కోనరావుపేట: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం దత్తత ఆలయమైన కోనరావుపేట మండలం మామిడిపల్లి శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలు, శ్రీరామనవమి వేడుకలకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో ఈనెల 29న బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 30న సీతారాముల కల్యాణం, ఏప్రిల్ 6న స్వామివారి రథోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఏర్పాట్లలో భాగంగా ప్రధాన ఆలయం, కల్యాణ వేదికకు రంగులు వేస్తున్నారు. విద్యుత్ దీపాలు ఏర్పాటుచేసి చలువ పందిళ్లు వేస్తున్నారు. కల్యాణానికి వచ్చే భక్తులకు మంచినీటి సౌకర్యం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరుతున్నారు. మండలంలోని మర్తనపేట, ధర్మారం, కోనరావుపేట, నిమ్మపల్లి గ్రామాల్లో శ్రీరామనవమి ఏర్పాట్లు చేస్తున్నారు. కనగర్తిలో నూతనంగా స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కేటీఆర్ నిజాలు మాట్లాడాలి...

సిరిసిల్లటౌన్: కేంద్ర ప్రభుత్వం అందించే నిధులపై మంత్రి కేటీఆర్ నిజాలు మాట్లాడాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు లగిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. గ్రామాల్లో 15వ ఆర్థికసంఘం నిధులతోనే అభివృద్ధి జరుగుతోందని గమనించాలన్నారు. జీపీలకు నిధులివ్వకుండా రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ప్రతీగ్రామంలో కేంద్ర సర్కారు అందించే నిధులతోనే అభివృద్ధి పనులు సాగుతున్నాయని వీటిపై బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. మంత్రిస్థాయిలో కేటీఆర్ అబద్ధాలు మాట్లాడడం సరికాదన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి రమాకాంత్‌రావు మాట్లాడుతూ.. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చొరవతోనే తెలంగాణకు కేంద్ర సర్కారు మెగా టెక్స్‌టైల్‌పార్కు ఆమోదం తెలిపిందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. బండి సంజయ్‌పై అవాక్కులు చవాక్కులు మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి గోపి, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, కౌన్సిలర్ భాస్కర్, కమలాకర్‌రావు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



ప్రెస్‌మీట్లో మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లటౌన్/తంగళ్లపల్లి: పంటనష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో ప్రెస్‌మీట్ నిర్వహించి మాట్లాడారు. తంగళ్లపల్లి మండలం రాళ్లపేట గ్రామ పరిధిలో పంట నష్టాన్ని సీపీఐ మండల కార్యదర్శి మంచికట్ల రమేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమ నాగరాజు పరిశీలించారు. రాళ్లపేట పరిధిలో 30 ఎకరాల్లో వరికి నష్టంవాటిల్లిందన్నారు. రైతులు అప్పులు చేసి పంటలు పండిస్తే.. అకాల వర్షాలతో అన్నదాతలు కుదేలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరానికి రూ. 50వేలు పరిహారం అందించాలని, వచ్చే సీజన్లో పంటలు వేయడానికి విత్తనాలు, ఎరువులు పూర్తి సబ్సిడీతో అందించాలని, రైతులు తీసుకున్న రుణాలు మాఫీచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కట్ట తిరుపతి, గణాధి శంకర్, బోయిన నరేందర్, రాజయ్య, అంజయ్య, వెంకట రాములు, రాజు, రాజయ్య, నారాయణ, సంజీవ్, దుర్గయ్య, పంతం రవి రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయకపోతే బీజేపీకి శాశ్వత దూరం

- ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా కన్వీనర్ అనిల్



ఎమ్మార్పీస్ నాయకులు

బోయినపల్లి(చొప్పదండి): రిజర్వేషన్లను ఏకపక్షంగా దోచుకునే వారికి బీజేపీ అండగా ఉంటుందని, ఎస్సీ వర్గీకరణ చేయకపోతే ఆ పార్టీకి ఎస్సీలు శాశ్వతంగా దూరమవుతారని ఎమ్మార్పీస్ కరీంనగర్ జిల్లా కన్వీనర్ బెజ్జంకి అనిల్ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించకపోవడానికి నిరసనగా అనిల్ ఆధ్వర్యంలో చొప్పదండి నియోజకవర్గంలో ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ యాత్ర మంగళవారం మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా బెజ్జంకి అనిల్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అన్నిపార్టీలు మద్దతు తెలిపినప్పటికీ వర్గీకరణ చేయడంలో కేంద్రం తాత్సారం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గుండా థామస్, ఖనాపురం లక్ష్మణ్, చిలుముల రాజయ్య, తుంగ ఆంజనేయులు, తంగళ్లపల్లి దేవరాజ్, దండు అంజయ్య, కొమ్ముల రాజమల్లు, నక్క లక్ష్మణ్, నారాయణ, అంజయ్య, శంకర్, మునీందర్ ఉన్నారు.

కరీంనగర్‌కు బండి సంజయ్ చేసిందేమీ లేదు

సిరిసిల్లఅర్బన్: నాలుగేళ్లలో ఎంపీ బండి సంజయ్ కరీంనగర్ నియోజకర్గానికి చేసిందేమీ లేదని తెలంగాణ రాష్ట్ర పవర్‌లూమ్ టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంత్రి కేటీఆర్, కేసీఆర్‌లపై బీజేపీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండించారు. మంత్రి కేటీఆర్ చొరవతో సిరిసిల్ల అన్నిరంగాల్లో అభివృద్ధిలో ముందుందన్నారు. మంత్రి కేటీఆర్‌ని విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జిందం చక్రపాణి, బొల్లి రాంమోహన్, మ్యాన రవి, దిడ్డిరాజు, సత్తార్, కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

- నంబర్ ప్లేట్‌లేని వాహనాలపై ప్రయాణిస్తే చర్యలు..
- డీఎస్పీ విశ్వప్రసాద్
- 12 వాహనాలు సీజ్



ఎల్లారెడ్డిపేటలో పోలీసుల తనిఖీలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నంబర్ ప్లేట్‌లేని వాహనాలపై ప్రయాణిస్తే వాహనాలను సీజ్‌చేసి కేసులు నమోదు చేస్తామని సిరిసిల్ల డీఎస్పీ విశ్వప్రసాద్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో మంగళవారం రాత్రి డీఎస్పీ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. నంబర్ ప్లేట్‌లేని 12 వాహనాలను సీజ్‌చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిపై కేసు నమోదుచేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులు గుర్తుతెలియని వాహనాలపై ప్రయాణిస్తే సమాచారం అందించాలన్నారు. తనిఖీల్లో సీఐ మొగిలి, ఎస్సై శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. ఏప్రిల్ 5న చేపట్టే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం తంగళ్లపల్లి మండలకేంద్రంలో ఛలో ఢిల్లీ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి కోడం రమణ, మండల కన్వీనర్ మోర అజయ్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను హరించే విధంగా.. పెట్టుబడిదారులకు, వ్యాపారస్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర ప్రకటించకుండా రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని దుయ్యబట్టారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను విపరీతంచేస్తూ ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. ఏప్రిల్ 5న 10 లక్షల మందితో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సామల కవిత, లిగంపల్లి కృష్ణవేణి, కనకయ్య, శ్రీనివాస్, నర్సయ్య, సదానందం, హరిదాసు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మవిశ్వాసానికి ప్రతీకలు

- మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు
- సైకాలజిస్ట్ పున్నంచందర్

సిరిసిల్ల: మహిళలు ఆత్మవిశ్వాసానికి ప్రతీకలని, ఎన్ని సమస్యలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొంటారని ప్రముఖ సైకాలజిస్ట్ కె.పున్నంచందర్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని బీ.వై.నగర్ కార్మిక క్షేత్రంలో మంగళవారం మనోవికాస కేంద్రం ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించి మాట్లాడారు. మహిళలు వ్యక్తిగతంగా మానసిక సమస్యలు, ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు నిర్లక్ష్యం చేస్తారని, ఇది సరైన విధానం కాదన్నారు. నిద్రలేమి, పదేపదే ఏవో ఆలోచనలు రావడం, తలనొప్పి, నీరసం, త్వరగా అలసిపోవడం, నిరాశకు లోనుకావడం, భయం, ఆందోళన చెందడం వంటి సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే జిల్లా ఆస్పత్రిలోని మనోవికాస కేంద్రాన్ని సంప్రదించాలని వైద్యులు కోరారు. కార్యక్రమంలో సిబ్బంది వేముల అన్నపూర్ణ, రాపెల్లి లత, బూర శ్రీమతి, కొండ ఉమ తదితరులు పాల్గొన్నారు.